క్లుప్తంగా

నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలి

మనుబోలు: 'ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.1800 కోట్లు ఖర్చు చేస్తోంది. అందుకనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని' రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి అన్నారు. మనుబోలు, మడమనూరులోని జెడ్పీ ఉన్నత, ఎంపీపీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని స్వయంగా రుచి చూశారు. ఎక్కువ మంది విద్యార్థులు పాఠశాలల్లో తినకుండా ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకోవడాన్ని గుర్తించి మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరాతీశారు. భోజనం ఎలా ఉంటుంది..పాఠశాలలో ఎందుకు తినడం లేదని విద్యార్థులను ప్రశ్నించగా వారు బాగా ఉందని సమాధానం ఇచ్చారు. విద్యార్థుల తీరును అనుమానించిన ఆమె కాగితంపై అభిప్రాయాలను రాసివ్వాలని కోరగా, భోజనం, కూరలు బాగుండడం లేదని, గుడ్లు సైతం ఒక్కోసారి కుళ్లిపోయి ఉంటున్నాయని తమ అభిప్రాయాలు తెలియజేశారు. స్పందించిన ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి అవసరమైన ప్రొటీన్లు, కాల్షియం, మినరల్స్, విటమిన్లు సమపాళ్లలో అందేలా మెనూను రూపొందించారన్నారు. నాణ్యమైన భోజనం అందించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాన్ని కాపాడేలా నిర్వాహకులు నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం తినేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో భోజనం చేస్తున్న, రిజిష్టర్‌లో నమోదు చేస్తున్న విద్యార్థు సంఖ్యకు తేడా ఉంటుందని, లోపాలను సరిచేసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట డీఈఓ గంగాభవానీ, ఎంపీడీఓ ప్రసాద్, వీఆర్వో నాగార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు పాదలకూరు విద్యార్థి



పొదలకూరు : స్థానిక డీఎన్నార్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ఎం వంశీకృష్ణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లా క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 6న పల్నాడు జిల్లా నర్సరావుపేటలో నిర్వహించనున్న అండర్–17 విభాగం అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో వంశీకృష్ణ పాల్గొననున్నట్లు హెచ్‌ఎం సనత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వంశీకృష్ణను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. పీఈటీ సునీత, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ



కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో అంగన్‌వాడీ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ శుక్రవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు సమ్మె బాట పట్టడంతో కేంద్రాల నిర్వహణను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో డ్వాక్రా మహిళలకు అప్పగించారు. వీరు కేంద్రాల్లో సకాలంలో చిన్నారులకు పౌష్టికాహారం ఇస్తున్నారా..లేదా..అని జేసీ పరిశీలించారు. అనంతరం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. పెద్ద ఎత్తున ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడంపై జేసీ సంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు. వైద్యశిబిరాలను సద్విని యోగం చేసుకునేలా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి తహసీల్దార్ గున్నం మల్లికార్జున, వైద్యాధికారి ఎం.రామకృష్ణ, ఎంఈఓ–2 ఎస్.అంకయ్య, ఈఓపీఆర్డీ వీ డేవిడ్ తదితరులు ఉన్నారు.

సీనియర్ పెన్షనర్లకు సన్మానం

పొదలకూరు : పట్టణంలోని మండల పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో పెన్షనర్ల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. అసోయేషన్ అధ్యక్షుడు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పెన్షనర్ల సమస్యలపై చర్చించారు. అనంతరం సీనియర్ పెన్షనర్లు సోమానాయుడు, లక్ష్మీనారాయణ, మస్తాన్‌సాహెబ్‌ను సన్మానించారు. అసోసియేషన్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, ట్రెజరర్ మస్తానయ్య పాల్గొన్నారు.

22న ఓటర్ల తుది జాబితా విడుదల

• కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): ఓటర్ల తుది జాబితాను ఈ నెల 22న విడుదల చేయనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో ఎన్నికల విభాగ సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ తొమ్మిది వరకు అందిన ఫిర్యాదులు, అభ్యంతరాలను జనవరి 12లోపు క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.

సత్వరమే చెత్త తరలింపు చర్యలు

ప్రైవేట్ కార్మికులతో సేకరించిన చెత్తను నగరంలోని వైఎమ్సీఏ మైదానం నుంచి తరలించే చర్యలను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రైవేట్ కార్మికుల ద్వారా పలు డివిజన్ల నుంచి చెత్తను వైఎమ్సీఏ మైదానానికి తరలించి, అనంతరం దొంతాలిలోని డంపింగ్ యార్డుకు తరలించే చర్యలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు.



సమీక్షిస్తున్న వికాస్ మర్మత్

కేన్సర్‌పై న్యాయవాదులకు అవగాహన

నెల్లూరు (లీగల్): కేన్సర్‌పై న్యాయవాదులకు అవగాహన కార్యక్రమాన్ని నెల్లూరు బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. మెడికవర్ హాస్పిటల్, నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని బార్ కౌన్సిల్ రాష్ట్ర సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. మెడికవర్ హాస్పిటల్ సర్జికల్ ఆంకాలజిస్ట్ రమేష్‌బాబు, కేన్సర్ విభాగ హెచ్‌ఓడీ బిందురెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వంత్‌రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ సుందరయ్య యాదవ్, ట్రెజరర్ ధన్‌పాల్ రమేష్, మహిళా న్యాయవాదుల రెప్రజంటేటివ్ రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.



బేటీ బచావో.. బేటీ పడావోపై శిక్షణ



నెల్లూరు (వేదాయపాళెం): గాంధీనగర్‌లోని మహిళా ప్రాంగణంలో బేటీ బచావో.. బేటీ పడావోపై శిక్షణ కార్యక్రమాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ, సమగ్ర బాలల సంరక్షణ పథకం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. మెప్మా పీడీ రవీంద్ర, రిసోర్స్ పర్సన్ రామ్‌కుమార్, నరసింహరావు, శ్రీనివాసరావు, బాలల సంరక్షణాధికారి సురేష్, సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ డైరెక్టర్ షెహనాజ్, ఐసీడీఎస్ సిబ్బంది మాధవి, సమత, పావని తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి పలువురి పరామర్శ

నెల్లూరు సిటీ: ప్రమాదానికి గురై నగరంలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని పలువురు పరామర్శించారు. త్వరలో కోలుకోవాలని కాంక్షించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మేరిగ మురళి, బల్లి కల్యాణ్ చక్రవర్తి, కల్పలతారెడ్డి, రామచంద్రారెడ్డి, ఏపీజీఈఎఫ్ రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆనం విజయకుమార్‌రెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి, డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ తదితరులు పరామర్శించారు.

నెల్లూరు(దర్గామిట్ట): ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ కాంక్షించారు. విజయవాడ పర్యటనలో ఉన్న కలెక్టర్ ఘటన విషయం తెలిసిన వెంటనే అపోలో ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్‌తో మాట్లాడారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. మెరుగైన వైద్యాన్ని అందించాలని కోరారు.

జెడ్పీ వాకర్స్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం

నెల్లూరు రూరల్: నగరంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మెట్టు సుధాకర్‌రెడ్డి ప్రమాణ స్వీకారాన్ని శుక్రవారం చేశారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు ఆనంతరావు, నరసింహులు, గిరిజ, లావణ్యకు ఎమ్జీఎఫ్ పతకాలను అందజేసి సత్కరించారు.
ఎమ్వీ రెడ్డి, బలరామనాయుడు, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఖాజామస్తాన్, చెంచయ్య, మేరీ బ్లెస్సింగ్టన్, రాణమ్మ, సుజన తదితరులు పాల్గొన్నారు.



రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ సీఐగా సుబ్బారావు బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి గుంటూరు రేంజ్ కార్యాలయానికి బదిలీ ఆయ్యారు. ఈయన స్థానంలో గుడ్లూరులో సీఐగా ఉన్న సుబ్బారావు ఇక్కడ నియమితులయ్యారు. రూరల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తగు చర్యలు చేపడతామని చెప్పారు. నేరాలు, చోరీల నియంత్రణపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు.



ఖాళీ స్థలంలో భవనముందని కనికట్టు

• కార్పొరేషన్ ఆదాయానికి గండి
• ఓ ఆర్ఐ నిర్వాకం
• ఫిర్యాదుతో రంగంలోకి ఏసీబీ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తనకు కేటాయించిన ప్రాంతంలో పన్నులు వసూలు చేసే విషయంలో చేతివాటాన్ని ప్రదర్శించారు. ఓ వ్యక్తి ఫిర్యాదుతో అసలు విషయం బయటపడింది. వివరాలు.. వనంతోపులో అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ రెడ్డికి 430 అంకణాల ఖాళీ స్థలం ఉంది. దీనికి గానూ వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ కింద నగరపాలక సంస్థకు ఆర్నెల్లకోసారి రూ.1,36,262 చెల్లించాల్సి ఉంది. ఇలా 2021 నుంచి ఇప్పటి వరకు ఆరు వాయిదాలకు గానూ రూ.8,17,575 చెల్లించాల్సి ఉంది. అయితే ఆ ప్రాంత ఆర్ఐ కృపాకర్ సదరు ఖాళీ స్థలానికి మార్కెట్ విలువ ప్రకారం పన్ను విధించకుండా తన ఇష్టపకారం విలువను రూ.3,98,89,360గా నిర్ణయించారు. ఒక వాయిదాకు రూ.1,07,701 చొప్పున రూ.6,46,206 పన్ను వేశారు. వనంతోపులోని ఖాళీ స్థలంలో పాత భవనం ఉందని సృష్టించి 2021, అక్టోబర్ 27న ఒక వాయిదాకు రూ.8,445 చెల్లించేలా చర్యలు చేపట్టారు. సంబంధిత స్థల యజమానుల నుంచి భారీ మొత్తంలో నగదు తీసుకొని ఎలాంటి ఇబ్బంది రాకుండా అన్నీ తానే చూసుకుంటానని చెప్పారనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై ఓ వ్యక్తి 2023 నుంచి ఇప్పటి వరకు అనేకసార్లు ఫిర్యాదు చేశారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో ఏసీబీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఈ విషయమై కమిషనర్‌ను కలిసి పూర్తి స్థాయిలో వివరాలను తెలియజేయాలని కోరారు. ఈ తరుణంలో ఆర్ఐ కృపాకర్ నిర్వాకంపై విచారణ జరపాల్సిందిగా రెవెన్యూ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఆర్ఐ కృష్ణకిశోర్, ఆర్ఓ సమద్‌తో పాటు టీపీఓ దేవేంద్రను కమిషనర్ ఆదేశించారు. ఈ మేరకు నాలుగైదు గంటల పాటు కృపాకర్‌ను శుక్రవారం రాత్రి విచారించి నివేదికను కమిషనర్‌కు అందజేశారని సమాచారం.

క్యాలెండర్ ఆవిష్కరణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ క్యాలండర్‌ను ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. బుచ్చిరెడ్డిపాళెంలో జరిగిన ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

పొదలకూరు : మండలంలోని లింగంపల్లి పాఠశాలలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. పొదలకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ విద్యార్థులు పాఠశాల పరిసరాల్లోని పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగాంపై పిల్లలకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, సర్పంచ్ చిట్టెమ్మ, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ గుంటి శ్రీనివాసులు, ప్రోగాం ఆఫీసర్ నాహిద్, హెచ్‌ఎం నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

బీటీఏ సభ్యత్వ నమోదు

పొదలకూరు : బహుజన టీచర్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదును శుక్రవారం చేపట్టారు. మండలంలోని అయ్యగారిపాళెం, అమ్మవారిపాళెం, తాటిపర్తి, తదితర గ్రామాల్లోని పాఠశాలలను బీటీఏ నాయకులు సందర్శించి సభ్యత్వాలను నమోదు చేశారు. జిల్లా ఆడిట్ సెక్రటరీ కృష్ణయ్య, షేక్ ఖాజారంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు కే కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే గ్రామసభలు

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు ,నిడిమునలి గ్రామాల్లో రీ సర్వేకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. రెండు గ్రామాల్లో మొత్తం 21 వినతలు అందాయని డిప్యూటీ తహసీల్దార్(సర్వే) రవికుమార్ తెలిపారు. పల్లిపాడులో 9, పల్లిపాడులో 12 మంది రైతులు వినతులు సమర్పించారని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ జీవన్‌కుమార్, మండల సర్వేయర్ హరనాథ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలో నలుగురు విద్యార్థుల డీబార్

వెంకటాచలం: మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో ఉన్న అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. ఉదయం జరిగిన ఒకటో సెమిస్టర్ పరీక్షకు 1,552 మంది విద్యార్థులకు గానూ 1,397 మంది హాజరయ్యారన్నారు. వివిధ పరీక్ష కేంద్రాల్లో ముగ్గురు విద్యార్థులు డిబార్ అయ్యారని తెలిపారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 7,371 మందికి గానూ 6,767 మంది హాజరయ్యారని, ఒకరిని డిబార్ చేసినట్లు వెల్లడించారు.

యూరియాను అధికంగా వాడొద్దు

ముత్తుకూరు: వరి పంటకు అధిక మోతాదులో యూరియా వాడొద్దని జిల్లా వనరుల కేంద్రం(ఆత్మ) డిప్యూటీ డైరెక్టర్ శివవన్నారాయణ సూచించారు. శుక్రవారం ముత్తుకూరులో ఆత్మ ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ లక్ష్మీమాధవి, ఏఓ గీతారాణి, కేవీకే శాస్త్రవేత్తలు విజయకుమార్, కిరణ్‌కుమార్, ఏఓ జ్యోత్స్నరాణి తదితరులతో కలిసి డీడీ వేరుశనగ, వరి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. వరి పంటకు యూరియాను అధికంగా వినియోగిస్తే అగ్గి తెగులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. వేరుశనగ పంటలో వేరుకుళ్లు తెగులు కనిపిస్తోందన్నారు. కాపర్ ఆక్సాక్లోరైడ్‌ను మొదళ్లు తడిచే విధంగా పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

కుష్టు సర్వేను పక్కాగా చేపట్టాలి

పొదలకూరు : కుష్టు సర్వేను పక్కాగా చేపట్టాలని అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలి వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మార్వో కాలనీలో చేపడుతున్న కుష్టు సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2027 నాటికి దేశాన్ని కుష్టు వ్యాధి రహితంగా నిలిపేందుకు ప్రభుత్వం సర్వేలు చేపడుతుందని తెలిపారు. కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే అంగవైకల్యం లేకుండా నివారించేందుకు అవకాశం ఉందన్నారు. చర్మంపై రాగి రంగు మచ్చలు కుష్టు లక్షణమని, ఎవరికైనా అలాంటి లక్షణాలు ఉంటే గుర్తించి సమీపంలో ఆస్పత్రులకు పంపాలని వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు.

పింఛన్ల నగదు పెంపు అభినందనీయం



నగదును అందజేస్తున్న రంగారెడ్డి

నెల్లూరు రూరల్: హామీ మేరకు పింఛన్ల నగదు మొత్తాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెంచడం అభినందనీయమని విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి పేర్కొన్నారు. రెండో డివిజన్లోని గుడిపల్లిపాడులో లబ్ధిదారులకు పింఛన్లను శుక్రవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. కార్పొరేటర్లు పడిగినేటి రామ్మోహన్‌యాదవ్, జానా నాగరాజు, మాజీ కార్పొరేటర్ లేబూరు పరమేశ్వరరెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సౌరశక్తితో పర్యావరణ పరిరక్షణ

నెల్లూరు రూరల్: పర్యావరణ పరిరక్షణకు సౌరశక్తి వినియోగం ఎంతో దోహదపడుతుందని ఐఐటీ ముంబై ప్రొఫెసర్, సోలార్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ చేతన్‌సింగ్ సోలంకి పేర్కొన్నారు. కలివెలపాళెంలోని రెయిన్‌బో ఇంటర్నేషనల్ స్కూల్లో శుక్రవారం నిర్వహించిన ఎంపవరింగ్ ఇండియా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ ఉపయోగాలను వివరించారు. సౌరశక్తి వినియోగం సకల జీవరాసి మనుగడకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సౌరశక్తిపై అవగాహన కల్పించేందుకు గానూ సోలార్ బస్సు యాత్రను 11 ఏళ్ల పాటు కొనసాగించనున్నామని, ఇప్పటికే మూడేళ్లు పూర్తయిందని చెప్పారు. సౌరశక్తి శాస్త్రవేత్త శ్రీనివాస్, పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపకుమార్, ప్రిన్సిపల్ అరుణ, వైస్ ప్రిన్సిపల్స్ సురేఖారెడ్డి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తున్న చేతన్‌సింగ్ సోలంకి

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల అందజేత

నెల్లూరు(బారకాసు): నగరంలోని 21వ డివిజన్లో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను కార్పొరేటర్ మొయిళ్ల గౌరి శుక్రవారం అందజేశారు. జేసీఎస్ ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, నేతలు బుజ్జన్న, పెంచలనరసారెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, సాయి, మాల్యాద్రి, లక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుకన్య, మహిళా రక్షణ సిబ్బంది రాజ్యలక్ష్మి, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.



8 నుంచి విద్యార్థులకు పోటీలు

నెల్లూరు రూరల్: విజయవాడలోని స్వరాజ్ మైదానంలో అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణను పురస్కరించుకొని జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మండల స్థాయిలో చిత్రలేఖన, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను ఈ నెల 8 నుంచి నిర్వహించనున్నామని డీఈఓ గంగాభవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు అక్కడే బహుమతులను అందజేయనున్నామని చెప్పారు. నగరంలోని డీకేడబ్ల్యూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయిలో పోటీలను ఈ నెల 11న నిర్వహించనున్నామని తెలిపారు. 12 నుంచి 15 ఏళ్లలోపు వారికి ఉదయం.. 16 నుంచి 18 ఏళ్లలోపు వారికి పోటీలను మధ్యాహ్నం నిర్వహించనున్నామని వివరించారు. పోటీలకు గంట ముందు వారి ఆధార్ కార్డుతో పూర్తి వివరాలను తెలుపుతూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. విజేతలకు వరుసగా రూ.లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలను అందజేయనున్నామని పేర్కొన్నారు.

రైలు కిందపడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మాగుంట లేఅవుట్ సమీపంలోని మూడో లైన్‌పై శుక్రవారం చోటుచేసుకుంది. మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ల లోపు ఉండొచ్చని భావిస్తున్నారు.
పింక్ కలర్‌పై వైట్ కలర్ డిజైన్ కలిగిన ఫుల్ హ్యాండ్స్ చొక్కా, ఆరెంజ్ కలర్ లుంగీని ధరించి ఉన్నారు. ఆత్మహత్య ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(బారకాసు): ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో మేయర్ స్రవంతి, జయవర్ధన్ దంపతులు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా నేదురుమల్లికి శాలువా కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు.



నగదు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు



హాజరైన అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్కిల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు సేవలందించే విషయంలో క్షేత్రస్థాయి సిబ్బందిపై ఫిర్యాదులొస్తున్నాయని, ఎవరైనా నగదు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ హెచ్చరించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో నెల్లూరు టౌన్, రూరల్ డివిజన్ల విద్యుత్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని, అయితే విధి నిర్వహణలో కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పగటి పూట లైట్లు వెలుగుతున్నా.. వైర్లు వేలాడుతున్నా.. లైన్లకు చెట్లకొమ్మలున్నా పట్టించుకోవడంలేదని, అధికారులు, సిబ్బంది ఏ మాత్రం పనిచేస్తున్నారో దీని ద్వారా అర్థం చేసుకోవచ్చన్నారు. సెక్షన్, రెవెన్యూ కార్యాలయాల్లో సిబ్బంది నిర్దేశించిన సమయానికి విధులకు హాజరై బయోమెట్రిక్ పద్ధతిలో హాజరు వేయాలని ఆదేశించారు. మూడు నెలలుగా విద్యుత్ వాడకం లేని సర్వీసులను లైన్ ఇన్‌స్పెక్టర్లు గుర్తించి తొలగించాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరాలో ఇబ్బందుల్లేకుండా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయాలని చెప్పారు. వినియోగదారులు వారికి అందే సేవలు, అధికారులు, సిబ్బందిపై ఫిర్యాదులను 91333 31912 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి, డీఈఈలు శ్రీధర్, మధుసూదన్‌రెడ్డి, భానూనాయక్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు నాగమణి, శ్రీలత, సుబ్బారావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయన్